7

సాక్షి సంగారెడ్డి

ఆదివారం। 3। ఆగస్టు। 2025



చిన్నకోడూరులో తపస్వీ ఫౌండేషన్ సభ్యులు

ఈ స్నేహం .. సమాజ హితం

చిన్నకోడూరు(సిద్దిపేట): పాఠశాల విద్య ముగిసినా.. చెరిగిపోని స్నేహం వారిది. ఐకమత్యంగా ఉంటూ సమాజానికి హితోధిక సాయం చేయాలనే కాంక్ష ఆ స్నేహితులది. బడిబాట నుంచి మొదలైన బాల్య మిత్రుల పయనం స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. చిన్నకోడూరు ఉన్నత పాఠశాలలో 1990–91లో పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులంతా ఒక్కటయ్యారు. 2016లో వీరంతా కలిసి తపస్వీ ఫౌండేషన్ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. చదివిన పాఠశాలకు రూ.లక్ష విరాళంగా ఇచ్చారు. పేద విద్యార్థులకు ఉన్నత చదువులకు ఆర్థిక సాయం, ఉచిత వైద్య శిబిరాలు, తోటి స్నేహితులకు కష్టకాలంలో ఆర్థిక సాయం అందిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

కల్మషం లేనిది.. కష్టాల్లో తోడుగా నిలిచేది



నిజమైన మిత్రులు.. ఇద్దరి కంటే ఎక్కువ ఉన్న వారే అధికం

- కన్నవారి తర్వాతే మిత్రుడు..
- ప్రస్తుత స్నేహ బంధాలు కలుషితం అవుతున్నాయి
- ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా సాక్షి సర్వే
- ఆసక్తి కరమైన అంశాలు వెలుగులోకి..

స్నేహానికి కన్న మిన్న.. లోకాన లేదురా.. అనేది ఒకప్పటి సినిమా పాట. ఇది నిజమేనంటున్నారు ఇప్పటి యువత, విద్యార్థులు, ఉద్యోగులు. స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని 'సాక్షి' బృందం ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రత్యేక సర్వే నిర్వహించింది. మొత్తం వంద మందితో ఈ సర్వే చేసింది. యువత, విద్యార్థులు, ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న వారు, వృత్తి నిపుణులు.. వివిధ వర్గాలకు చెందిన వారి ఒపీనియన్‌లను సేకరించింది. తమ అభిప్రాయలు వెలుబుచ్చిన వారిలో సగం మంది మహిళలు ఉన్నారు. ఈ సర్వే ఆసక్తికరమైన అంశాలు వెలుగు చూశాయి. కల్మషం లేనిదే నిజమైన స్నేహమని ఎక్కువ మంది తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేయగా, నిజమైన స్నేహంలో స్వార్థానికి తావులేదని చెప్పారు. అవసరాలు తీర్చేదే స్నేహమని తక్కువ మంది తన అభిప్రాయాన్ని వెలుబుచ్చారు.

స్నేహం కలుషితమవుతోంది..


ప్రస్తుత రోజుల్లో ఫ్రెండ్ షిప్ కలుషితమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వంద మందిలో 57 మంది ఇదే అభిప్రాయాన్ని చెప్పారు. ఎలాంటి కలుషిత కాలేదని 47 శాతం మంది చెప్పారు. ప్రస్తుత రోజుల్లో స్నేహితులు ఎంతో మంది ఉంటారు. కానీ నిజమైన స్నేహితులు పరిమితంగానే ఉంటారు. మీకు నిజమైన స్నేహితులు ఎంత మంది ఉన్నారనే ప్రశ్నకు ఇద్దరి కంటే ఎక్కువ మంది నిజమైన స్నేహితులు ఉన్నారని చెప్పిన వారే అధికంగా ఉన్నారు. ఇద్దరు కంటే ఎక్కువ మంది స్నేహితులున్నారని 61 మంది చెప్పగా, ఒక్కరే నిజమైన స్నేహితుడు ఉన్నాడని 39 మంది అన్నారు.

మొదటగా కన్నవారే..

కన్న వారి తర్వాతే మిత్రుడికి స్థానమని ఎక్కువ మంది చెప్పారు. 67 శాతం మంది ఇదే అభిప్రాయాన్ని తెలిపారు. 27 శాతం మంది ఫ్రెండ్ తర్వాతే అమ్మానాన్న అని చెప్పిన వారు కూడా ఉన్నారు. నాన్న, అమ్మ, ఫ్రెండ్ అని చెప్పిన వారు 16 మంది ఉన్నారు.

– సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి, సంగారెడ్డి జోన్/మెదక్ జోన్/సిద్దిపేట

ఉమ్మడి జిల్లాలో సర్వే వివరాలు..



మన కోసం నిలబడే వాళ్లే..



సంగారెడ్డి టౌన్: స్నేహితుల దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు. మనకోసం నిలబడే వాళ్లే నిజమైన స్నేహితులు. కష్టాలు, బాధలు, సంతోషాలను పంచుకుంటూ అందరితో కలిసిపోతూ ఉండాలి. నా చిన్న నాటి నుంచి ముగ్గురు స్నేహితులం. వారు వృత్తిరీత్యా ఇతర దేశాల్లో స్థిర పడినప్పటికీ సమయం దొరికినప్పుడు కలుస్తూ ఉంటాం. ప్రతి ఒక్కరూ అందరితో కలిసి ఉండాలి. 'నేను ఉన్నాను' అనే ధైర్యం ఇవ్వాలి. సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ విజ్ఞాన పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి.

– సౌజన్య, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

ఆనాటి స్మృతులు మధురం



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): స్నేహితులతో కలిసి మట్టిలో ఆడిన ఆటలు.. చెట్టు కొమ్మల్లో దాగిన రోజులు నేటికీ గుర్తుకువస్తే ఎంతో సంతోషంగా ఉంటోంది. మళ్లీ ఆరోజులు వస్తే బాగుండు అనిపిస్తుంది. నాడు ఎక్కడికి వెళ్లినా ఒక జట్టుగా వెళ్లేవాళ్లం. ఒకరింటికి మరొకరం వెళ్తూ సందడి చేసే వాళ్లం. వినాయక చవితి, దసరా, దీపావళి, బోనాలు, బతుకమ్మ, హోలీ పండుగలను మిత్రులతో సంతోషంగా జరుపుకొనేది. చాలా మంది మిత్రులు నేడు ఉపాధ్యాయ వృత్తితో పాటు ఇతర వృత్తుల్లో ఉన్నారు. ఏ హోదాలో ఉన్నా కలుసుకున్నపుడు అనుభూతి ఏర్పడుతోంది.

– శ్రీనివాస్‌రెడ్డి, సిద్దిపేట జిల్లా విద్యాశాఖ అధికారి

బాల్య స్నేహితుడికి బాసట



గోపాల్ కుటుంబానికి బాసటగా నిలిచిన స్నేహితులు

శివ్వంపేట(నర్సాపూర్): బాల్య స్నేహితుడు అనారోగ్యంతో మృతిచెందగా తోటి స్నేహితులు మేమున్నామంటూ బాధిత కుటుంబానికి బాసటగా నిలిచారు. శివ్వంపేటకు చెందిన శేరిపల్లి గోపాల్ అనారోగ్యంతో ఆరేళ్ల క్రితం మృతిచెందాడు. ఇతనికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పేద కుటుంబానికి చెందిన గోపాల్.. వర్గల్‌లోని నవోదయ విద్యాలయంలో 1992–93లో పదో తరగతి పూర్తి చేశాడు. అప్పటి నవోదయ స్నేహితులు గోపాల్ కుటుంబాన్ని ఆదుకున్నారు. స్నేహితులందరూ రూ.3 లక్షలు పోగుచేసి గోపాల్ కుమార్తెలు చందన, అక్షయ పేరిట బ్యాంకులో డిపాజిట్ చేశారు.





- చెరగని చెలిమి.. చెదరని ఆత్మీయం
- వీడదీయలేనిది స్నేహబంధం

నేడు ఫ్రెండ్ షిప్ డే

ఓ నేస్తమా..

సమస్తం నీవే మిత్రమా...

ఆప్తులున్నవారే అసలైన అదృష్టవంతులు



మెదక్ మున్సిపాలిటీ: వ్యక్తి ఏ స్థాయిలో ఉన్నా.. ఎన్ని ఆస్తులున్నా.. ఆప్తులను సంపాదించుకున్న వారే అదృష్టవంతులు. ఎవరి సమక్షంలో మన బాధలు సగం అవుతాయో.. ఎవరి కారణంగా మన ఆనందం రెట్టింపు అవుతుందో వారే అసలైన ఆప్త మిత్రులు. మానవ బంధాలన్నీ ఆర్థిక సంబంధాలతో ముడిపడుతున్న ఈ ఆధునిక యుగంలో స్వచ్ఛమైన స్నేహం కోసం తాపత్రయపడే వాళ్లెందరో ఉన్నారు. నేను డ్యూటీలో ఎంత బిజీగా ఉన్నా.. రోజూ స్నేహితులతో పది నిమిషాలు మాట్లాడతా. చిన్నప్పుడు కలిసి చదువుకున్న స్నేహితులతో ఇప్పటికీ కలుస్తాను. వారితో మాట్లాడి, ఊరు విషయాలు, కుటుంబ విషయాలు, ఇతర విషయాల గురించి చర్చించుకుంటాం. స్నేహితులతో కలిసి మాట్లాడటం వల్ల ఎంతో రిలీఫ్ ఉంటుంది.

– డీవీ శ్రీనివాసరావు, ఎస్పీ, మెదక్ జిల్లా



హ్యాపీ ఫ్రెండ్‌షిప్ డే.. అనగానే ఏదో తెలియని అనుభూతి.. ఎదలోతుల్లోని జ్ఞాపకాలు ఒక్కసారిగా ఉబికివస్తాయి.. మరెన్నో మధుర స్మృతులు కళ్లముందు కదలాడుతాయి. అదొక అద్భుత స్నేహలోకం కనిపిస్తుంది.. స్నేహం అవధులు లేనిది.. అంతస్తులు చూడనిది.. వయసు లెక్కచేయనిది.. ఇష్టాలను పంచుకునేది.. కష్టాల్లో తోడుగా నిలిచేది.. ఇలా ఒకటేమిటి.. ఆ బంధాన్ని తెలిపేందుకు భావాలు ఎన్నో.. ఇలా స్నేహం గురించి ఎన్ని చెప్పినా.. అందుకే అంటారు స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతమని. నేటి ఆధునిక సాంకేతిక యుగంలో సామాజిక మాధ్యమాల కారణంగా ఎప్పుడో చిన్ననాటి స్నేహితులు కూడా దగ్గరవుతున్నారు. అలాంటి కోవలోకే ఉమ్మడి జిల్లాలోనూ కొందరు ఉన్నత స్థాయిలో ఉన్నా స్నేహ బంధాన్ని కొనసాగిస్తున్నారు. అంతేకాదు సమాజహితానికి తోడ్పడుతున్నారు. సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. మరోవైపు ఓ కిడ్నాప్ ఘటన ముగ్గురిని ప్రాణస్నేహితులను చేయడం విచిత్రం. ఇలా ఎన్నో తీయనైన, మధురమైన స్నేహాలపై నేడు ఫ్రెండ్ షిప్ డే సందర్భంగా మచ్చుకు కొన్ని ప్రత్యేక కథనాలు..



'బంధీ'తో స్నేహ బంధం

ప్రాణస్నేహితులను చేసిన కిడ్నాప్ ఘటన..



మాజీ ఎమ్మెల్సీ ఫారూక్ హుస్సేన్, రామన్న, సికిందర్ కలిసి ఉన్న చిత్రం

దుబ్బాక: ఓ కిడ్నాప్ ఘటన ముగ్గురిని ప్రాణస్నేహితులను చేసింది. 34 ఏళ్ల క్రితం కిడ్నాప్ ఘటన జరిగినా ఆ ముగ్గురి మధ్య ప్రేమ నేటికీ చెక్కుచెదరలేదు. ఆ నాటి సంఘటన ఒక్కసారి గుర్తు చేసుకుందాం.. 1991 ప్రాంతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా సీఎంగా నెదురుమల్లి జనార్దన్‌రెడ్డి ఉన్నారు. పీపుల్స్‌వార్ ప్రాబల్యం అధికంగా ఉన్న ఆ రోజుల్లో ప్రస్తుత మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నారు. ఓ రోజు ఫారూఖ్ తన చిన్ననాటి స్నేహితుడు సికిందర్ తో కలిసి స్కూటర్‌పై దుబ్బాకకు వస్తున్న క్రమంలో అప్పటి దుబ్బాక పీపుల్స్ వార్ దళం కమాండర్‌గా ఉన్న రామన్న ఫారూఖ్, సికిందర్‌లను కిడ్నాప్ చేయడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. వరంగల్ జిల్లాకు చెందిన రామన్న ఉద్యమ రీత్యా దుబ్బాక ప్రాంతంలో పనిచేస్తుండగా అప్పటి వరకు వీరికి ఎలాంటి పరిచయం లేదు. కిడ్నాప్ అయినప్పుడే వీరికి రామన్న పరిచయం అయ్యాడు. ఆతర్వాత రామన్న పీపుల్స్ వార్ పార్టీని వీడి జనజీవన స్రవంతిలోకి వచ్చాక మాజీ ఎమ్మెల్సీ ఫారూక్, సికిందర్, రామన్నలు ప్రాణస్నేహితులయ్యారు. రామన్న ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండడంతో ఆ కుటుంబానికి ఫారూఖ్ హుస్సేన్ చాలా సార్లు అండగా నిలిచారు. వీరు ముగ్గురు తరుచూ కలుస్తూ తమ కష్ట సుఖాలు పంచుకుంటూ ఆదర్శ స్నేహితులుగా నిలిచారు. ఏదేమైనా బంధీలో పరిచయంలో ఈ ముగ్గురిని ప్రాణస్నేహితులను చేయడం విశేషం.

క్లాస్‌మేట్స్ క్లబ్ పేరిట సేవలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 1981 టెన్త్ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు కలిసి క్లాస్‌మేట్స్ క్లబ్ పేరిట సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. క్లాస్‌మేట్స్ క్లబ్ అధ్యక్షుడు జయప్రకాశ్ మాట్లాడుతూ నాగర్ కర్నూల్‌కు చెందిన ఉపాధ్యాయులు క్లాస్‌మేట్స్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని మా పూర్వ విద్యార్థులందరం కలిసి క్లాస్‌మేట్స్ క్లబ్ పేరిట సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. స్నేహితులు తమకు తోచిన విధంగా ఆర్థిక సహాయం చేస్తున్నారు. తాము చదువుకున్న పాఠశాలతో పాటు పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 2023 నుంచి నోట్ పుస్తకాలు అందిస్తున్నాం. అలాగే పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నాం. స్నేహితులందరం కలిసి సేవా కార్యక్రమాలు చేపట్టడం సంతోషంగా ఉంది.



క్లాస్‌మేట్స్ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం





పాఠశాలలో ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు కట్టుకొని శుభాకాంక్షలు తెలుపుకొంటున్న విద్యార్థులు

స్నేహ బంధం..

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలల్లో ముందస్తు ఫ్రెండ్‌షిప్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లను కట్టుకొన్నారు. ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

– ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)

క్లుప్తంగా

కనీస వేతనాలు అమలు చేయాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు



కందిలో ధర్నాలో పాల్గొన్న సిబ్బంది, కార్మికులు

కంది(సంగారెడ్డి): గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26,000లు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రమైన కంది గ్రామపంచాయతీ వద్ద శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ..గ్రామపంచాయతీలో పనిచేస్తున్న సిబ్బందికి గతంలో ఇచ్చిన వేతనాలను కూడా తగ్గించి ఇవ్వడం దారుణమన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది మల్లేశ్, వీరరాజు, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

రీసెర్చ్ స్కాలర్ అర్షద్ హుస్సేన్‌కు డాక్టరేట్

పటాన్‌చెరు: పటాన్‌చెరు మండలం రుద్రారం గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, లైఫ్ సైన్సెస్ విభాగం ఎన్విరాన్‌మెంట్ సైన్స్‌లో పరిశోధక విద్యార్థి అర్షద్ హుస్సేన్ మాలిక్ డాక్టరేట్ లభించింది. 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తీర ప్రాంతంలో తుపాను, ఉప్పెన వంటి సహజ ప్రమాదాల అంచనాకు రిమోట్ సెన్సింగ్, భౌగోళిక సమాచార వ్యవస్థ (జీఐఎస్) అనువర్తనాలను ఉపయోగించడం'పై ఆయన అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రంధి ఉమాదేవి శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

'బనకచర్ల'పై ఆరోపణలు అర్థరహితం

మాజీ కార్పొరేషన్ చైర్మన్ మఠం భిక్షపతి

వట్‌పల్లి(అందోల్): బనకచర్ల ప్రాజెక్ట్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఆరోపణలు అర్థరహితమని తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం భిక్షపతి పేర్కొన్నారు. జోగిపేటలో జరిగిన కాంగ్రెస్ సభలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ చేసిన ఆరోపణలను మఠం తీవ్రంగా ఖండించారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువులను పునరుద్ధరించడంతోపాటు కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి లక్షల ఎకరాలకు సాగునీటిని అందించి బీడు వారిన భూములను సస్యశ్యామలం చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. బనకచర్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదన్నారు.

అన్‌ట్రైన్డ్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

డీఈఓ వెంకటేశ్వర్లును కోరిన టీబీఎస్ నాయకులు



డీఈఓ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం ఇస్తున్న టీబీఎస్ నాయకులు

జహీరాబాద్ టౌన్: అన్‌ట్రైన్డ్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ బంజార ఎంప్లాయిస్ సేవా సంఘం(టీబీఎస్) నాయకులు డీఈఓ వెంకటేశ్వర్లును కోరారు. ఈమేరకు శనివారం ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీబీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పీపీరాథోడ్, ప్రధాన కార్యదర్శి తులసీరాం రాథోడ్‌లు మాట్లాడుతూ అన్‌ట్రైన్డ్ డీఎస్సీ ఉపాధ్యాయులు అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. డీఎస్సీల వారీగా సీనియారిటీ జాబితా రూపొందించి ప్రమోషన్‌లు ఇవ్వాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో నాయకులు దేవీసింగ్, మంజునాయక్ తదితరులున్నారు.

గ్రూపులుంటేనే మజా!

- గ్రూపులు, ఆధిపత్య పోరు లేకుండా పార్టీ అభివృద్ధి చెందదు
- ఎన్నికలు వస్తే అంతా ఒక్కటై పనిచేయాలి
- పాత, కొత్త నాయకుల కలయికతో ముందుకు సాగుదాం
- కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్ కుమార్ గౌడ్. చిత్రంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మంత్రి దామోదర, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి, ఎంపీసురేశ్‌షెట్కార్ తదితరులు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి /వట్‌పల్లి : రాజకీయ పార్టీల్లో ఆధిపత్య పోరు, గ్రూపులు లేకుంటే ఆ పార్టీ అభివృద్ధి చెందదని, గ్రూపులు ఉంటేనే ఉత్సాహం ఉంటుందని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. గ్రూపు తగాదాలు లక్ష్మణ రేఖ దాట వద్దని సూచించారు. అన్ని నియోజకవరా ్గల్లో గ్రూపులు ఉంటాయని, ఎన్నికలు వస్తే అన్ని గ్రూపులు ఒక్కటై పోరాడి విజయం సాధించాలని హితవు పలికారు. తాము మాత్రం అన్ని గ్రూపులకు సమాన ప్రాధాన్యమిస్తామని స్పష్టం చేశారు. జనహిత పాదయాత్రలో భాగంగా కాంగ్రెస్ నాయ కులు శనివారం జోగిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో నిర్వహించిన శ్రమదాన కార్యక్రమంలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం సంగుపేటలో జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలమని, చాలా ఏళ్లుగా పార్టీలో పనిచేస్తున్న వారికే ప్రాధాన్యతనిస్తామని తెలిపారు. పార్టీకి కొత్త నీరు కూడా అవసరమని అందుకే 15% కొత్తవారిని కూడా తీసుకుంటున్నామని, పాత, కొత్తల కలయికతో ముందుకు సాగుతున్నామని వివరించారు.

సర్వేల ఆధారంగానే స్థానిక టికెట్లు

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచే అభ్యర్థులకే టికెట్లు ఇస్తామని, సర్వేల ఆధారంగానే ఈ టికెట్ల కేటాయింపు ఉంటుందని మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. నిత్యం ప్రజలతో మమేకమయ్యే వారి ఇంటికే స్థానిక సంస్థల ఎన్నికల టికెట్లు నడిచివస్తాయని తెలిపారు. చాలా ఏళ్లుగా పార్టీలో పనిచేస్తున్న వారికి కార్పొరేషన్ డైరెక్టర్ పోస్టులు ఇస్తామని చెప్పారు.

పటాన్‌చెరు నాయకులు దూరం

జనహిత పాదయాత్ర కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి పటాన్‌చెరు నియోజకవర్గం కార్యకర్తలు, నాయకులు దూరంగా ఉన్నారు. అన్ని నియోజకవర్గాల నుంచి ముఖ్య కార్యకర్తలు నేతలు ఈ సమావేశానికి హాజరైనప్పటికీ, ఈ నియోజకవర్గం నుంచి ఆ పార్టీ శ్రేణులు రాకపోవడం చర్చనీయాంశంగా మారింది.

పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తించండి: కార్యకర్తలు

పార్టీ కోసం కష్టపడిన వారినే గుర్తించాలని పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు మీనాక్షి నటరాజన్, మహేశ్‌కుమార్‌గౌడ్‌లకు విజ్ఞప్తి చేశారు. తమ పబ్బం గడుపుకునేందుకు పార్టీలోకి వచ్చిన వారికి ప్రాధాన్యత ఇవ్వద్దని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు వంటి సంక్షేమ పథకాల లబ్ధిదారులను ఎంపిక చేసే అధికారం ఇందిరమ్మ కమిటీలకు ఇవ్వాలని కోరారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ సురేశ్‌షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, సెట్విన్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ గిరిధర్‌రెడ్డి, పార్టీ నాయకులు చంద్రశేఖర్, రెడ్డిపల్లి ఆంజనేయులు, ఆవుల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు, రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో బీఆర్ఎస్ కాంగ్రెస్ నాయకుల మధ్య ఘర్షణ

రసాభాసగా చెక్కుల పంపిణీ కార్యక్రమం

- బీఆర్ఎస్, కాంగ్రెస్ వర్గీయుల మధ్య ఘర్షణ
- అభివృద్ధి కోసం రాజకీయాలు పక్కన పెడతా: ఎమ్మెల్యే సునీతారెడ్డి

హత్నూర(సంగారెడ్డి): మండల కేంద్రమైన హత్నూర రైతు వేదికలో శనివారం నిర్వహించిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం రసాభాసగా మారింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సునీతారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతుండగా కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసేందుకు పెద్ద ఎత్తున నినాదాలతో సమావేశ మందిరంలోకి ఒక్కసారిగా వచ్చారు. దీంతో వెంటనే అక్కడే ఉన్న బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ నాయకులను అడ్డుకోవడానికి యత్నించగా ఒక్కసారిగా ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో అక్కడే ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రం పటం చినిగిపోయింది. దీంతో కాంగ్రెస్ నాయకులు మరింత రెచ్చిపోయి పెద్ద ఎత్తున సునీతారెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ దశలో పోలీసులు రంగప్రవేశం చేసి ఇరు పార్టీల నాయకులకు నచ్చజెప్పినా వినకపోవడంతో వారందరినీ బయటకు లాక్కెళ్లారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు పోలీస్ స్టేషన్ చేరుకుని సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాన్ని చించేసిన బీఆర్ఎస్ నాయకులపై ఫిర్యాదు చేయగా...బీఆర్ఎస్ నాయకులు సైతం కాంగ్రెస్ నాయకులపై ఫిర్యాదు చేశారు. ఇరు వర్గాల ఫిర్యాదులపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ప్రభాకర్ తెలిపారు.

ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తా

ప్రజల సంక్షేమం కోసం తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం కోసం, అభివృద్ధి కోసం అవసరమైతే ముఖ్యమంత్రి రేవంత్‌ను, మంత్రులను కూడా కలుస్తానని ఆమె స్పష్టం చేశారు. నర్సాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి గత ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని తెలిపారు. అంతేకాకుండా తాను ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేను కావడంతో ఇక్కడ అభివృద్ధి పనులు చేసేందుకు ప్రభుత్వం వివక్ష చూపుతోందన్నారు. నియోజకవర్గంలో తాను చేపట్టే ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల విషయాలలో అధికార పార్టీ నాయకులు అనవసర రాద్ధాంతం చేస్తుండటం సరికాదన్నారు. అనంతరం మండలంలోని ఆయా గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన 187 రేషన్ కార్డులు 40 కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులకు పోలీసులు అండగా ఉంటూ ప్రోత్సహిస్తున్నారని సమయం వచ్చినప్పుడు చూస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసిల్దార్ ఫర్హీన్ షేక్, ఎంపీడీవో శంకర్, డిప్యూటీ తహసీల్దార్ దావూద్ హరిబాబు, లబ్ధిదారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఫొటో చించిన వారిపై చర్యలు తీసుకోవాలి: డీసీసీ అధ్యక్షుడు

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటాన్ని చించివేసిన దుండగులను వెంటనే శిక్షించాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి డిమాండ్ చేశారు.

అరుణాచలంకు ప్రత్యేక బస్సు

నారాయణఖేడ్: ఈనెల 9న రాఖీపౌర్ణమిని పురస్కరించుకుని ఖేడ్ నుంచి అరుణాచలానికి ప్రత్యేక సూపర్ లగ్జరీబస్సు నడపనున్నట్లు స్థానిక ఆర్టీసీ డీఎం మల్లేశయ్య తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ...ఈనెల 7వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఖేడ్ జంటగ్రామమైన మంగల్‌పేట బస్టాండ్ నుంచి అరుణాచలానికి బస్సు బయల్దేరుతుందన్నారు. కాణిపాకం, వేలూరు గోల్డెన్ టెంపుల్‌ను దర్శించుకుని 9న పౌర్ణమినాడు ఉదయం అరుణాచలానికి చేరుకుంటుందన్నారు. గిరిప్రదక్షణ అనంతరం సాయంత్రం 6 గంటలకు అక్కడినుంచి బయల్దేరి 10న ఆలంపూర్ జోగులాంబతల్లి అమ్మవారి శక్తిపీఠం దర్శించుకున్నాక అక్కడినుంచి బయల్దేరి రాత్రి ఖేడ్‌కు చేరుకుంటుందని తెలిపారు. ఒక్కొక్కరికీ చార్జీ రూ.4,500 ఉంటుందన్నారు. పూర్తివివరాలకు 9959223170, 9441071134, 9676667703, 9063417294 నంబర్లలో సంప్రదించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైద్య కళాశాలలో పోస్టుల భర్తీ

కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రకాశ్‌రావు

సంగారెడ్డి : సంగారెడ్డి జిల్లా వైద్య కళాశాలతో పాటు, జిల్లా ఆస్పత్రిలో పలు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. కాంట్రాక్టు పద్ధతిన అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ట్యూటర్లు, సీనియర్ రెసిడెంట్ పోస్టులకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రకాశ్‌రావు శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. అర్హత గలవారు ఈ నెల 4న ఉదయం 10:30 గంటలకు నుంచి 5వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు తమ దరఖాస్తులను సమర్పించవచ్చన్నారు. దరఖాస్తులు స్వీకరించిన అనంతరం ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

జనరహిత పాదయాత్ర

మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ఎద్దేవా



విలేకరులతో మాట్లాడుతున్న క్రాంతికిరణ్

జోగిపేట(అందోల్): కాంగ్రెస్ పార్టీ చేపట్టిన జనహిత పాదయాత్రలో జనరహితంగా సాగిందని అందోలు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఎద్దేవా చేశారు. శనివారం అందోల్‌లోని ఒక ఫంక్షన్ హాలులో స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఏఐసీసీ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ గానీ పాదయాత్ర ఎందుకు చేస్తున్నారో ఇప్పటి వరకు స్పష్టం చేయలేదన్నారు. పాదయాత్రలో కనీసం ప్రజా సమస్యలు వినలేకపోయారని విమర్శించారు. ఆరు గ్యారంటీల అమలులో ప్రజాప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయిందన్నారు. బనకచర్ల ప్రాజెక్ట్‌తో చంద్రబాబుకు తొత్తులుగా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆరోపించారు. సంగమేశ్వర బసవేశ్వర ప్రాజెక్టు కోసం బీఆర్ఎస్ పార్టీ పాదయాత్ర చేపట్టనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో పుల్కల్, టేక్మాల్ మండలాల పార్టీ అధ్యక్షులు మాచర్ల విజయ్ కుమార్, వీరప్ప, అందోల్ మండల నాయకులు చాపల వెంకటేశం, నాగరత్నంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడికి మతి భ్రమించింది

సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి: పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మండిపడ్డారు. సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..అజ్ఞానంతో రేవంత్‌రెడ్డితో పోటీ పడటం అవివేకమన్నారు. బీఆర్ఎస్ చేసిన పనులు ప్రస్తుతం కళ్లకు కట్టినట్లు కనిపిస్తున్నాయని గ్రామాల్లోకి వెళ్తే ప్రజలే చెబుతారని వ్యాఖ్యానించారు. హరీశ్‌రావుపై మాట్లాడేటప్పుడు ఆయన చేసిన అభివృద్ధిని చూసి ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు.

సమస్యలు పరిష్కరించకపోతే ముట్టడే

బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి



ధర్నాలో మాట్లాడుతున్న గోదావరి

పటాన్‌చెరు: స్థానిక ప్రజా ప్రతినిధులు ఇప్పటికైనా అభివృద్ధిపై దృష్టి పెట్టాలని, లేనిపక్షంలో మున్సిపల్ ఆఫీస్‌ను ముట్టడిస్తామని జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి హెచ్చరించారు. అమీన్‌పూర్‌లోని పటేల్ గూడా, కృష్ణారెడ్డిపేట్ పరిధిలో కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలంటూ బీజేపీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ధర్నాలో గోదావరి, పటాన్‌చెరు అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్‌గుప్తా పాల్గొని మాట్లాడారు. ఇన్ని రోజులు ఈ ప్రాంత ప్రజా ప్రతినిధులు, అధికారులు దోచుకున్న సొమ్మును కక్కించే బాధ్యత బీజేపీ తీసుకుంటుందన్నారు. అమీన్‌పూర్ బీజేపీ మండల అధ్యక్షుడు ఈర్ల రాజు ముదిరాజ్ మాట్లాడుతూ..మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి సహకారంతో ఈ ప్రాంతంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. కృష్ణారెడ్డి పేట గ్రామ పరిధిలోని దుర్గానగర్ కాలనీకి కలెక్టర్ పార్కుకోసం స్థలాన్ని కేటాయిస్తే కొందరు నాయకుల కారణంగా అది ఇప్పటికీ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. పటేల్‌గూడ గ్రామంలో కూడా వివిధ కాలనీలలో రోడ్లు అభివృద్ధికి నోచుకోలేదని ప్రజలు నరకయాతన పడుతున్నారని రోడ్ల సమస్యల పరిష్కారానికి కాలనీ అసోసియేషన్‌ల నుంచి అధికార పార్టీ నాయకులు డబ్బులను డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు.

ఈత చెట్ల పెంపకానికి భూములివ్వాలి

కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్నగౌడ్



సర్వాయి పాపన్నవిగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కల్లుగీత కార్మిక సంఘం నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): ఈత చెట్లు పెంచేందుకు కల్లు గీత సొసైటీలకు భూములివ్వాలని కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్నగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గొల్లపల్లిలో కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం అమరవీరుల యాదిలో గీతన్నల సామాజిక చైతన్యయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సర్దార్ సర్వాయి పాపన్న, మహాత్మ జ్యోతిరావు పూలే, చాకలి ఐలమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి, అక్కడనుంచి మల్కాపూర్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆశన్నగౌడ్ మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం ఈత తాటి చెట్ల పెంపకానికి ప్రతీ కల్లుగీత సొసైటీలకు ఐదు ఎకరాల ప్రభుత్వ భూమి ఇవ్వాలని, వాటి సంరక్షణ కోసం డ్రిప్, బోరు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా గీత కార్మికులకు, గౌడ కులస్తులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. మునిదేవునిపల్లి, మాందాపూర్ అలియాబాద్ గ్రామాలలో వందల ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్న కల్లుగీత సొసైటీలకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు?

18 వరకు సామాజిక చైతన్య యాత్ర

సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని పురస్కరించుకుని ఈ నెల 18 వరకు సామాజిక చైతన్యయాత్ర కొనసాగుతుందని అదేరోజు సంగారెడ్డిలో ముగింపు సభ నిర్వహించనున్నట్లు ఆశన్నగౌడ్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్‌గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, కృష్ణగౌడ్, నాగరాజు గౌడ్, రామాగౌడ్, వెంకటేశంగౌడ్, కుమార్‌గౌడ్, మల్కాపూర్ టీటీసీఎస్ అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్, అనంతయ్య గౌడ్, రమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యం

కోవ్ అధ్యక్షురాలు కల్పనారావు



కోవ్‌మార్ట్‌లో ఏర్పాటుచేసిన స్టాల్

రామచంద్రపురం (పటాన్‌చెరు): మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి కోవ్ (తెలంగాణ రాష్ట్ర మహిళా పారిశ్రామిక వేత్తల సమాఖ్య) ప్రధాన లక్ష్యమని ఆ సంస్థ అధ్యక్షురాలు కల్పనారావు స్పష్టం చేశారు. శనివారం తెల్లాపూర్ పట్టణ పరిధిలోని రాజా పుష్ప గ్రీండేల్ కమ్యూనిటీలో కోవ్ మార్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, మహిళలు తమ ఉత్పత్తులను ప్రదర్శించేందుకు, విక్రయించేందుకు ఈ వేదిక ఏర్పాటు చేశామన్నారు. ఈ మార్ట్‌లో 30కి పైగా మైక్రో మహిళా వ్యాపారులు తమ ఉత్పత్తులను ప్రదర్శించారు. కార్యక్రమంలో కోవ్ కార్యదర్శి అనురాధ కరాటి, కోశాధికారి కీర్తి చీకోటి, సంయుక్త కార్యదర్శి నిషా అగర్వాల్, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ నీరజ గోదావరి తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న పైపులైన్ పూర్తవడంతో సంబరాలు

కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటాపోటీగా జలాభిషేకాలు



కోమటిబండలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి జలాభిషేకం చేస్తున్న నర్సారెడ్డి, నాయకులు



కేసీఆర్ చిత్రపటానికి జలాభిషేకం చేస్తున్న గులాబీ నాయకులు

గజ్వేల్ : స్థానిక సంస్థల ఎన్నికలకు రంగం సిద్ధమవుతున్న వేళ...గజ్వేల్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పోటాపోటీ కార్యక్రమాలతో ముందుకుసాగుతున్నాయి. మల్లన్నసాగర్ రిజర్వాయర్ నుంచి గజ్వేల్‌కు రూ.210కోట్లతో చేపట్టిన ప్రత్యేక మిషన్ భగీరథ పైపులైన్ పనులు పూర్తయి మంచినీటి సరఫరా ప్రారంభమైంది. శనివారం రెండు పార్టీలు జలాభిషేకాలు నిర్వహించాయి. డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు గజ్వేల్ మండలం కోమటిబండ గుట్టపై ఉన్న మిషన్ భగీరథ హెడ్‌వర్క్స్ వద్ద సీఎం రేవంత్ చిత్రపటానికి జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ సీఎం చొరవ వల్లే గజ్వేల్‌కు మల్లన్నసాగర్ నుంచి మిషన్ భగీరథ ప్రత్యేక పైపులైన్ వచ్చిందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ కృషివల్లే గజ్వేల్‌కు మిషన్ భగీరథ నీరు వచ్చిందని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేస్తూ గజ్వేల్‌లోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద కేసీఆర్ చిత్రపటానికి జలాభిషేకం చేశారు.

ఊరురా తల్లి పాల వారోత్సవాలు

తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు, సిబ్బంది



తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

న్యాల్‌కల్(జహీరాబాద్): తల్లి పాల ప్రాముఖ్యతపై సరైన అవగాహన లేకపోవడం, కుటుంబ పరిస్థితుల కారణంగా తల్లులు తమ పిల్లలకు తల్లి పాలను సక్రమంగా అందించడం లేదు. ఫలితంగా పిల్లలకు సరైన పోషకాలు అందక వ్యాధుల బారిన పడుతున్నారు. వారి ఎదుగుదలపై కూడా ప్రభావం పడుతోంది. దీనిని గుర్తించిన ప్రభుత్వం తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకు ప్రతి ఏటా తల్లి పాల వారోత్సవాలు నిర్వహిస్తోంది. అందులోభాగంగా ఈ ఏడాది కూడా తల్లి పాల వారోత్సవాలను ప్రారంభించింది. గత రెండు రోజులుగా ఊరురా తల్లి పాల వారోత్సవాలు కొనసాగుతున్నాయి.

జిల్లాలో 1,504 అంగన్‌వాడి కేంద్రాలు

జిల్లాలో 1,504 అంగన్‌వాడి కేంద్రాలున్నాయి. 1,432 మంది అంగన్‌వాడి కార్యకర్తలు పని చేస్తున్నారు. ఆయా కేంద్రాల పరిధిలో 19,405 మంది గర్భిణులు, బాలింతలు ఉండగా, 1,02,724 మంది చిన్నారులున్నారు. వీరందరికి అంగన్‌వాడి కార్యకర్తలు పౌష్టికాహారం అందిస్తున్నారు. పౌష్టికాహారంతోపాటు తల్లి పాల ప్రాముఖ్యతను వివరిస్తున్నప్పటికీ పూర్తి స్థాయిలో ఫలితాలు రాకపోవడంతో ప్రభుత్వం తల్లి పాల వారోత్సలపై ఊరురా అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వారోత్సవాల్లో తల్లిదండ్రులతోపాటు ఆశ వర్కర్లు, స్వయం సహాయ సంఘాల సభ్యులు, వైద్య సిబ్బంది, ఇతర శాఖల అధికారులను భాగస్వామ్యం చేసింది. వీరంతా గ్రామాల్లో నిర్వహిస్తున్న వారోత్సవాల్లో తల్లి పాల ప్రాముఖ్యతను వివరిస్తున్నారు. బిడ్డ పుట్టగానే గంటలోపు తల్లి పాలను బిడ్డకు పట్టించాలని, 6 నెలల వరకు తల్లి పాలను అందించాలని, తల్లి పాలలో బిడ్డ ఎదుగుదలకు అవసరమైన అనేక పోషకాలు అందుతాయని, చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తి కూడా పెరుగుతుందని వారు అవగాహన కల్పిస్తున్నారు.

తల్లి పాలపై అవగాహన కల్పిస్తున్నాం



జిల్లాలోని అన్ని గ్రామాల్లో తల్లి పాల వారోత్సవాలు నిర్వహిస్తున్నాం. బిడ్డ పుట్టిన గంటలోపు పాలిచ్చే తల్లులు 34% ఉండగా, 6నెలలలోపు పాలిచ్చే తల్లులు 65% ఉన్నారు. తల్లులకు అవగాహన కల్పించి పిల్లందరికీ 6 నెలల లోపు తల్లిపాలను తప్పకుండా అందించేలా కృషి చేస్తున్నాం.

– లలితాకుమారి, జిల్లా సంక్షేమాధికారి,సంగారెడ్డి